మందుబాబులకు షాకిచ్చారు

- ఎన్నికలకు ముందు మద్యం ధరలు తగ్గిస్తామంటూ చంద్రబాబు హామీ
- ఇప్పుడేమో షాపుల వద్ద అధిక ధరలకు అమ్మకాలు
- ప్రతి బాటిల్‌పై ఎమ్మార్పీ కన్నా రూ.10 నుంచి రూ.30 అదనంగా వసూలు

అమలాపురం టౌన్: 'మేము అధికారంలోకి రాగానే నాణ్యమైన మద్యం బ్రాండ్లు తీసుకొస్తాం. తాగుబోతులకు తక్కువ ధరలకు మద్యాన్ని అమ్ముతాం.' ఎన్నికలకు ముందు మందుబాబులకు చంద్రబాబు ఇచ్చిన హామీ ఇది. తీరా అధికారంలోకి వచ్చాక కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటుచేశాక అక్కడకు వెళుతున్న మందుబాబులకు షాక్ తగులుతుంది. ధరలు తగ్గించడం మాట అటుంచి చాలాచోట్ల ప్రతి బాటిల్‌పై ఎమ్మార్పీ కన్నా రూ.10 నుంచి రూ.30 వరకూ పెంచి అమ్మేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోమని ఇలాగే అమ్ముతామంటూ కుండబద్దలు కొట్టేస్తున్నారు. దీంతో మందుబాబులంతా చంద్రబాబు మళ్లీ ముంచేసినాడురో అంటూ లబోదిబోమంటున్నారు.

చెప్పిందొకటి.. చేసిందొకటి

అమలాపురం నియోజకవర్గానికి 18, ముమ్మిడివరం నియోజకవర్గానికి 13 కలిపి మొత్తంగా 31 మద్యం దుకాణాలు కేటాయించారు. ఆయా మద్యం దుకాణాల్లో క్వార్టర్ లిక్కర్ రూ.99కే ఇస్తామన్న కూటమి పార్టీల నేతలు అమలవుతాయని మందుబాబులంతా కోటి ఆశలు పెట్టుకున్నారు. ఎప్పుడెప్పుడు కొత్త మద్యం దుకాణాలు వస్తాయా.. రూ.99కే క్వార్టర్ తాగుదామా అని తెగ తహతహలాడిపోయారు. మద్యం కొత్త పాలసీలో దుకాణాలు తెరుచుకున్న తొలి రోజే మందుబాబులు దుకాణాల వద్ద క్యూ కట్టారు. తీరా అక్కడేమో క్వార్టర్ ధర రూ.99 కాకుండా రూ.150 అని చెబుతుండడంతో అవాక్కయ్యారు. దీంతో ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందని మందుబాబులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధరలపరంగా మమ్మల్ని మోసం చేసి ఓట్లు వేయించుకుని కూటమి పార్టీ నేతలను గెలిపించుకున్నారని ధ్వజమెత్తుతున్నారు. దీంతో కొందరు వ్యాపారులు కొత్త స్టాక్ వచ్చాక ధరలు కాసింత మారతాయంటూ మందుబాబులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.



అమలాపురం రూరల్ మండలం సమనస మద్యం దుకాణం వద్ద మందుబాబుల జోరు

మళ్లీ తెరపైకి అధిక ధరలు

అమలాపురం పట్టణంలోని ఐదు దుకాణాలతో పాటు అమలాపురం రూరల్ మండలం సమనస, కాట్రేనికోన మండలం తీర గ్రామాల్లో ఏర్పాటైన ఆరు దుకాణాల్లో అమ్మకాలు తొలి రోజే జోరుగా సాగాయి. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు హయాంలో మద్యం వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి అనధికారికంగా బెల్ట్ షాపులు పెట్టి మరీ ప్రతి బాటిల్‌పై రూ.5 నుంచి రూ.10 వరకూ అదనంగా వసూలు చేసి మందుబాబుల జేబులు గుల్ల చేసేవారు. ఇప్పుడు చాలాచోట్ల మద్యం వ్యాపారులు మరో అడుగు ముందుకేసి నేరుగా కొత్త మద్యం దుకాణాల్లోనే ఒక్కో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.30 వరకూ ధరలు పెంచి అమ్మేస్తున్నారు. ప్రధానంగా కాట్రేనికోన మండలంలోని ఆరు మద్యం దుకాణాల్లోనూ ఇదే పంథా నడుస్తోంది. కాయకష్టం చేసుకునే తమకు మద్యం తాగకపోతే శరీర కష్టాలు తీరవని ఆవేదన వ్యక్తం చేస్తూనే మందుబాబులంతా చేసేదిలేక అధిక ధరలకు మద్యం కొనుగోలు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీలకు భాగస్వామ్యం కల్పించాలి

అమలాపురం టౌన్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ పేరుతో నిర్వహించనున్న పనులను ఉపాధి హామీ పథకంలో చేర్చి కూలీలకు భాగస్వామ్యం కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రామకృష్ణతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న పల్లె పండుగలో ఎంపిక చేస్తున్న పనులన్నీ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలని సూచించారు. వరదలు, వర్షాల కారణంగా పనులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కార్మికులకు, ఉపాధి కూలీలకు సరైన పనుల కల్పనకు పల్లె పండుగ పనులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు.

బాధిత బాలుడికి ఆర్థిక సాయం



బాలుడికి ఆర్థిక సాయం అందిస్తున్న శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: చేతిలో దీపావళి బాంబు పేలి తీవ్రగాయమైన అయినవిల్లి మండలం విలస గ్రామానికి చెందిన బాధిత బాలుడు బొక్కా హేమంత్‌కు హైదరాబాద్ గుత్తుల మీరా కుమార్(జీఎంకే) చారిటబుల్ ట్రస్ట్ రూ.15 వేల ఆర్థిక సాయాన్ని సమకూర్చింది. స్థానిక సూర్యనగర్‌లో శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాసరావు సమక్షంలో పిల్లి గోపాలకృష్ణల చేతుల మీదుగా ఆదివారం సాయం అందజేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు గొవ్వాల రాజేష్, విత్తనాల శేఖర్, బుల్లెట్ రాజు, సంసాని బులినాని, చిట్టూరి పెదబాబు, దంగేటి రుద్ర, చెల్లుబోయిన నాని, చొల్లంగి సుబ్బిరామ్ తదితరులు పాల్గొన్నారు.

27న కవి సంధ్య స్వర్ణోత్సవ సభ

యానాం: యానాం కేంద్రంగా వెలువడుతున్న కవి సంధ్య కవిత్వ పత్రిక స్వర్ణోత్సవ సభను ఈ నెల 27న ఉదయం 9.30 గంటలకు స్థానిక గీతాభవన్‌లో నిర్వహించనున్నట్లు పత్రిక సంపాదకులు, కళారత్న, కవికోకిల డాక్టర్ శిఖామణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణతో పాటు వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవిత్వ పురస్కారాలు, పన్నెండు మందికి కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, డాక్టర్ దీర్ఘాశి విజయ్‌భాస్కర్, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ వీరలక్ష్మీదేవి, డాక్టర్ ఆర్.సీతారాం, జి.వెంకటకృష్ణ, డాక్టర్ చెలికాని స్టాలిన్, దాట్ల దేవదానం రాజు, మధునాపంతుల, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, బొల్లోజు బాబా, సుంకర గోపాల్ తదితరులు పాల్గొంటారన్నారు.

దుర్గాదేవి ఆలయంలో మల్లాడి పూజలు



దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న మల్లాడి

యానాం: స్థానిక యూకేవీ నగర్‌లో కొలువైన దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. దేవీ నవరాత్ర మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఏర్పాటుచేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి భక్తులకు వడ్డించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో యూకేవీ నగర్ గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సినిమాలు



వెంకటరమణ	స్వాగ్
శ్రీలలిత	జనక అయితే గనక
శేఖర్-1	విశ్వం
శేఖర్-2	ఇద్దరు
రమా	దేవర
వీపీసీ-1	వేట్టయాన్
వీపీసీ-2	లవ్ రెడ్డి

బొత్సను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఎమ్మెల్సీ బొత్సను మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను జిల్లా పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ తదితర నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా ఆదివారం కలిసి అభినందించారు. విజయనగరంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ బొత్సను కలిసినవారిలో శిరీష్‌తో పాటు జిల్లా పార్టీ ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శి ఉంగరాల సంతోష్, పార్టీ యువసేన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఉంగరాల లక్ష్మణరావు తదితరులున్నారు.

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి



ఉత్తమ సేవలందించిన ప్రతినిధులను సత్కరిస్తున్న వాసవీ క్లబ్స్ ప్రతినిధులు

తాళ్లరేవు: పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని, ఎటువంటి ఆదరణ లేని అభాగ్యులకు ప్రతిఒక్కరూ తమ వంతు సహాయం చేయాలని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ సిద్ధా వెంకట సూర్యప్రకాశరావు అన్నారు. ఆదివారం స్థానిక సూర్య భాస్కర కల్యాణ మంటపంలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ క్లబ్స్ జిల్లా గవర్నర్ గోకవరపు సుభాష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 52 వాసవీ క్లబ్‌ల ద్వారా చేసిన సేవలను ప్రతినిధులు వివరించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలందించిన క్లబ్‌లకు అవార్డులను అందజేశారు. అత్యధిక సేవా కార్యక్రమాలతో ప్రథమ స్థానంలో కాకినాడ క్లబ్ నిలువగా, సర్పవరం క్లబ్‌కు ద్వితీయ, తుని క్లబ్‌కు తృతీయ అవార్డులు లభించాయి. అదేవిధంగా వైశ్య సామాజిక వర్గం నుంచి విశేష సేవలందించిన పదిమందిని క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పేకేటి సతీష్, వరదా శేషు, అత్తులూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బ్రాందీషాపు పెట్టడానికి వీల్లేదంటూ నిరసన

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని బోడసకుర్రుపాలెం కొండాలమ్మ వీధిలో నూతన మద్యం షాపును స్థానిక మహిళలు అడ్డుకుని నిరసన తెలిపారు. జాతీయ రహదారికి కేవలం 60 అడుగుల దూరంలో లేఅవుట్‌లో మద్యం షాపు ఏర్పాటుచేసేందుకు నిర్వాహకులు లారీలతో గ్రావెల్‌ను ఆదివారం తరలించారు. దీంతో స్థానికులకు అనుమానం వచ్చి లారీ డ్రైవర్‌ని నిలదీయగా బ్రాందీషాపు ఏర్పాటుచేయడానికి కంకర వేస్తున్నామని తెలిపారు. దీంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య బ్రాందీ షాపు ఎలా ఏర్పాటుచేస్తారని ప్రశ్నించారు. కనీసం కొండాలమ్మ వీధిలోని వారిని సంప్రదించకుండా నిర్ణయాలు ఎలా తీసుకుంటారని నిర్వాహకుల్ని నిలదీశారు. గతంలో ఏర్పాటుచేసిన బ్రాందీషాపు వల్ల తీవ్ర ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య బ్రాందీషాపు ఏర్పాటుచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వనుము శ్రీలక్ష్మి, వనుము మంగాదేవి, కృపావతి, రాయుడు లక్ష్మీపార్వతి, దుర్గాదేవి, వాసర్ల లక్ష్మి, వనుము సత్తిపండు, వాసర్ల శ్రీను, బొక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బ్రాందీషాపు ఏర్పాటును అడ్డుకుని నిరసన తెలుపుతున్న మహిళలు

దీన్ దయాళ్ 'స్పర్శ్' పరీక్ష

అమలాపురం టౌన్: అమలాపురం తపాలా డివిజన్ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాగ్దేవి స్కూలులో విద్యార్థులకు దీన్ దయాళ్ స్పర్శ్ యోజన పరీక్ష ఆదివారం జరిగింది. తపాలా శాఖచే స్కాలర్‌షిప్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ అప్టిట్యూడ్ అండ్ రీసెర్చ్ ఆన్ స్టాంప్స్ యాజ్ ఏ హాబీ(స్పర్శ్) పేరిట విద్యార్థులకు ఏడాదికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు భారత తపాలా శాఖ నిర్ణయించిందని అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు తమ శాఖ నిర్వహించే ప్రాజెక్ట్ వర్క్‌లో పనిచేసిన తరువాత స్కాలర్‌షిప్ మంజూరవుతుందన్నారు. డివిజన్‌లోని వివిధ పాఠశాలల నుంచి 278 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు.



పరీక్షను పర్యవేక్షిస్తున్న అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ తదితరులు

పరీక్ష జరుగుతున్న శ్రీవాగ్దేవి పాఠశాలను పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం తదితరులు సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పర్యవేక్షించారు.

దురుసుగా ప్రవర్తించిన వారిపై ఫిర్యాదు

అల్లవరం: జూనియర్ లైన్‌మన్ కుడుపూడి సింహాద్రితో దురుసుగా ప్రవర్తించి, వాగ్వావాదానికి దిగిన వ్యక్తులపై విద్యుత్ అధికారులు అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం మండలంలోని గుండెపూడిలో ఆక్వా సాగు చేస్తున్న పోతుల నరసయ్యకు సంబంధించి రూ.2 లక్షల మేర విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉంది. మూడు నెలలుగా విద్యుత్ బకాయి చెల్లించకపోవడంతో నరసయ్య విద్యుత్ సర్వీసుని స్థానిక లైన్‌మన్ తొలగించారు. విద్యుత్ నిలిచిపోవడంతో నరసయ్య కొంత మందితో కలిసి దేవగుప్తం సబ్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ విధులు నిర్వహిస్తున్న లైన్‌మన్ సింహాద్రితో వాగ్వాదానికి దిగి దురుసుగా ప్రవర్తించారు. దీంతో లైన్‌మన్ సింహాద్రి జరిగిన ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై ఏఈ వెంకటేశ్వరరావుని వివరణ కోరగా విద్యుత్ బిల్లు బకాయి ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాలతోనే సర్వీసుని తొలగించామన్నారు.

కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలి



బద్రి బాబ్జి

ఉప్పలగుప్తం: గ్రామగ్రామాన పార్టీ కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అన్నారు. మండలంలోని చినగాడవిల్లి గ్రామంలోని తన నివాసంలో ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామగ్రామాన సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

యానాం: స్థానిక శ్రీత్యాగరాజ సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో చింతావారి వీధిలోని రామాలయంలో త్యాగరాజ ఆరాధనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆరాధనోత్సవంలో భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని గాయకులు ఆలపించారు. ఈ సందర్భంగా త్యాగరాజ మొదటి కీర్తన నమో నమో రాఘవాయా, జగదానంద కారకా, ఎందరో మహానుభావులు తదితర కీర్తనలను పలువురు గాయనీ, గాయకులు, స్థానిక బాలభవన్ చిన్నారులు ఆలపించారు. అనంతరం గురుపూజలో భాగంగా త్యాగరాజ సంగీతానికి విశేష కృషిచేసిన బ్రహ్మశ్రీ మహేంద్రవాడ రామచంద్రమూర్తిని పలువురు శిష్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నర్సింహమూర్తి, మైథిలి, చింతా కొండలరావు, శేరు విష్ణుమూర్తి, సీఎస్ఆర్‌కే మూర్తి, కుమారశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



జెల్లావారిపేటలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని జెల్లావారిపేటలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

అమలాపురం రూరల్: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పేరూరు గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సమనస, గున్నేపల్లి అగ్రహారం, సాకుర్రు, వన్నెచింతలపూడి, నడిపూడి గ్రామాల్లో చేపట్టనున్న నూతన అభివృద్ధి పనులకు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దాసరి అరుణ, గుత్తుల చిరంజీవిరావు, పెద్దిరెడ్డి రామచంద్రరావు, నక్కా రాజారత్నం నాగవాణి, చెల్లుబోయిన నాని, ఎంపీటీసీ సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ అధికారి జయ వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, పెచ్చెట్టి చంద్రమౌళి, పాలమూరి ధర్మ పాల్, మల్లుల పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



పేరూరులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ముగిసిన షిరిడీ సాయి ఆరాధనోత్సవాలు

యానాం: స్థానిక కోరంగి నదీ తీరంలో కొలువైన శ్రీసద్గురు షిరిడీ సాయిబాబా వారి ఆలయంలో 30వ ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన మహా అన్నసమారాధనకు సుమారు 4 వేల మంది భక్తులు హాజరై బాబా ప్రసాదాన్ని స్వీకరించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా నాలుగు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బాబాకు ఆదివారం పంచామృతాభిషేకం, పుష్పార్చన, గణపతిహోమం, సాయిహోమం, కాకడ హారతి జరిపారు. అన్నసమారాధనను పురస్కరించుకుని బాబాకు బంగారు కిరీటాన్ని అలంకరించారు. కార్యక్రమంలో షిరిడీ సాయి ధార్మిక ప్రచార కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో షిరిడీ సాయిబాబా

ఇంటింటికీ ఉచిత గ్యాస్ అందించాలి

తాళ్లరేవు: మండలంలో ఉన్న రిలయన్స్ చమురు సంస్థ ద్వారా మండల ప్రజలకు ఇంటింటికీ పైపు లైన్ ద్వారా గ్యాస్‌ను ఉచితంగా అందించాలని సీపీఎం పార్టీ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో సీపీఎం పార్టీ 3వ మండల మహాసభను వల్లు రాజబాబు అధ్యక్షతన నిర్వహించారు. మూడేళ్లలో పార్టీ ద్వారా జరిగిన కార్యకలాపాలను పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు వివరించారు. అనంతరం ఏడుగురు సభ్యులతో పార్టీ మండల కమిటీని నియమించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భవిష్యత్‌లో రిలయన్స్ ద్వారా ఉచిత గ్యాస్‌ను మండల ప్రజలకు అందించాలని కోరారు. సీఎస్ఆర్ నిధులతో విద్య, వైద్య రంగాలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటికలకు ప్రభుత్వమే స్థలాలు కొని ఇవ్వాలని, కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు.

లక్ష్మీనృసింహుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పిల్లాపాపలతో స్వామి వారిని దర్శనానికి తరలి వచ్చారు. ఆలయంలో నిర్వహించిన నారసింహ సుదర్శన హోమంలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. సుమారు 4 వేల మంది సాధారణ, ప్రత్యేక దర్శనాల ద్వారా స్వామిని దర్శించుకున్నట్టు దేవస్థానం తెలిపింది. దర్శనం అనంతరం భక్తులకు నిత్యాన్నదానంలో భోజన సౌకర్యం దేవస్థానం సిబ్బంది కల్పించారు. భక్తుల భోజన వసతిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

స్వామికి ప్రత్యేక పూజలు

ఈ నెల 25న విడుదల చేయనున్న నూతన చిత్రం 'ఎంత పని చేసావ్ చంటి' విజయవంతం కావాలని ప్రార్థిస్తూ పీజేకే బ్యానర్ యూనిట్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ మేరకు నటీనటులతో కూడిన యూనిట్, చిత్రం పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించింది. హీరో శ్రీనివాస్ ఉలిశెట్టి, నీహారిక కేశవ్, శాంతి ప్రియ, పటాన్ జిలాన్ ఖాన్ తదితర నటులతో, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ ఉదయ్ కుమార్.ఆర్ నిర్మాతలుగా లడ్డే బ్రదర్స్ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు.



అంతర్వేది ఆలయంలో ఎంత పని చేసావ్ చంటి చిత్రం పోస్టర్ ఆవిష్కరించిన యూనిట్ సభ్యులు

హాస్టల్ విద్యార్థులకు నిత్యావసరాల పంపిణీ



శాంతి సదన్‌లో నిత్యావసరాలు అందుకున్న పిల్లలతో ట్రస్టు సభ్యులు

సఖినేటిపల్లి: స్థానిక శాంతి సదన్ హాస్టల్లో ఉన్న పిల్లలకు ఆదివారం షాలోమ్ ఇజ్రాయేల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేశారు. పర్ణశాలల పండుగ సందర్భంగా ట్రస్టు ద్వారా నిర్వాహకులు పై పంపిణీని చేపట్టారు. తాడి సహదేవ్, బాలు, వినోద్, మెస్సయ్య సమాజం, కేపీ పోడు షాలోమ్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి మల్లాడి పరామర్శ

తాళ్లరేవు: మాజీ ఎంపీపీ అరదాడి కృష్ణకుమారి భర్త అరదాడి శ్రీరామచంద్రమూర్తి(85) ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో కృష్ణకుమారిని పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట కామాడి మాతరాజు, వనమాడి నూకరాజు, అరదాడి అన్నవరం, బర్రే లక్ష్మీనరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి బోనస్

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఆదివారం పుదుచ్చేరి ప్రభుత్వం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రూ.7 వేలు బోనస్(ఇన్సెంటివ్) ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాత్కాలిక బోనస్‌గా కేంద్ర వేతన వ్యవస్థ ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఇన్సెంటివ్ ప్రకటించడంతో పుదుచ్చేరి ప్రభుత్వం సైతం తమ ఉద్యోగులకు బోనస్ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్.శివకుమార్ సంబంధిత జీఓను విడుదల చేశారు. గ్రూప్-బీ, సీ కేటగిరీ ఉద్యోగులకు బోనస్ వర్తిస్తుందని జీఓలో పేర్కొన్నారు.

యువతికి సాయం అందజేత

మామిడికుదురు: అనారోగ్యంతో బాధపడుతున్న అప్పనపల్లికి చెందిన యువతి ఉండ్రు ధనలక్ష్మికి పలువురు దాతలు రూ.40 వేల ఆర్థిక సాయం అందించారు. సోషల్ మీడియాతో పాటు పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన దాతలు ఇండియన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ సహాయం అందించారు. దాతలు అందించిన మొత్తాన్ని ఆర్గనైజేషన్ ప్రతినిధులు యువతి కుటుంబ సభ్యులకు అందజేశారు. తాడి శ్రీను రూ.10 వేలు, మత్తి జాన్సన్ రూ.10 వేలు, మట్టా రాకేష్ రూ.5 వేలు, మగటపల్లి అంబేద్కర్ యూత్ రూ.3100, ఇతర దాతలు సహాయం అందించారని ఆర్గనైజేషన్ ప్రతినిధులు తెలిపారు. కష్టాల్లో ఉన్న యువతి కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు.